◆ఈవారం కథ

ఆరోజు అప్పడే ఆరోసారి వనజాక్షి వల్లభరావు దగ్గరకి రావడం.

"... కథ పాకాన్న పడ్తున్నట్టుంది..." అన్నాడు సురేష్ మెల్లగా.

"... కొత్తగా పాకాన పడడానికేముంది? అని చిత్రంగా నవ్వి –

"... అయినా ఆ సీటు మహత్యమే అంత..." అన్నాడు చలపతి నాకు విన్పించేటట్టు. నేనేమీ మాట్లాడలేదు. అవును.

ఆ 'సీటు' మహత్యమే అంత. నేనూ గమనిస్తూనే వున్నాను. అధికారమూ, ధనమూ వున్న చోటికి వనజాక్షే కాదు. అవసరమున్న వాళ్ళందరూ చేరతారు. ఒకటికి నాలుగుసార్లు తిరుగుతారు. కాకపోతే వనజాక్షిలాంటి వారు 'ఓవర్ ఏక్టివ్', మరీ ఎక్కువగా 'ఇన్‌టిమసీ' చూపెట్టినట్టుగా వుంటుంది.

నిజం చెప్పాలంటే –

ఆ సీటు మహత్యం గురించి వల్లభరావు ఆ సీటులోకి వచ్చాకే మా అందరికీ తెలిసింది. ఏ ఆఫీసర్‌కి ఏ అవసరమైనా వల్లభరావునే పిలుస్తారు. టి.ఏ. బిల్లు తొందరగా 'పాస్' కావాలంటే వల్లభరావు 'కరుణిం'చాలి. ఒక వూరునుండి ఇంకో వూరుకి ట్రాన్స్‌ఫర్ కావాలన్నా, ఆఖరికి, ఓ సెక్షన్నుండి ఇంకో సెక్షన్‌కి ట్రాన్స్‌ఫర్ కావాలన్నా వల్లభరావు 'సహాయం' కావాలి. ఆఫీసులో ఫ్యూన్లు అందరూ ఏ ఒక్కరికీ 'పలకక' పోయినా వల్లభరావుకి 'సలాము'లు కొడ్తుంటారు.

ఆఫీసర్ ఏ చిన్న విషయమైనా వల్లభరావునే సంప్రదిస్తాడు.

దానికితోడు –

ఈ మధ్య 'క్యాంటిన్ ఇన్‌ఛార్జ్' కూడా వల్లభరావుకి యిచ్చారు. క్యాంటిన్‌కి సరుకులు సప్లై చేసేవాళ్ళు, క్యాంటిన్ మేనేజర్, ఒకరని ఏమిటి అందరూ వల్లభరావంటే 'గజగజ' లాడేవారు. రోజూ ప్రొద్దున్నే అందరికన్నా ముందుగా వస్తాడు. వచ్చినప్పటినుండి క్షణం తీరికలేకుండా సగంరోజు క్యాంటిన్ లెక్కలు చూసి, మిగిలిన సమయంలో టి.ఏ. బిల్లో, ఆనరోరియమ్ బిల్లో, మరొక పనిలోనో మునిగిపోయేవాడు. సాయంత్రం ఆరు అయి అందరూ వెళ్ళిపోయినా ఏవో లెక్కలు చూస్తుండేవాడు.

"... ఆఫీసర్‌గాడూ ... వీడూ 'వాటా'లు పంచుకుంటుంటారు..." అంటుంటాడు చలపతి.

ప్రత్యక్షంగా ఎవడూ చూడకపోయినా 'అన్నిపన్లకి' పనుల స్థాయిల్ని బట్టి 'ఫిక్స్‌డ్ రేట్లు' పెట్టుకున్నాడని వినికిడి. డబ్బు సంపాదించడం ఓ వ్యసనం. ఆ వ్యసనానికి బానిసైనవాడు మగువకీ, మధువుకీ చేరువకావడం ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదు. అప్పడప్పడూ 'డ్రింకింగ్' అలవాటు వుందని తెలిసినా, ఈ మధ్య తరుచు తాగుతున్నాడని గుసగుసలు విన్పిస్తున్నాయి.

ఏం 'తంత్రం' చేశాడోగానీ సత్యమూర్తిగారికి రావలసిన 'పోస్టు' వల్లభరావు 'కొట్టే'శాడు!

మా ఆఫీసులో సంప్రదాయంగా ఆ 'సీటు'ని 'సీనియర్ మోస్ట్' వుద్యోగి కిస్తున్నారు. చాలామంది సీనియర్లకి మూడు నాలుగేళ్ళు మించి సర్వీసుండేది కాదు. రెండేళ్ళ క్రితం పద్ధతి ప్రకారం సత్యమూర్తిగారికే ఆ పోస్టు వస్తుందనుకున్నారు. ఆయనకప్పటికి నాలుగేళ్ళ సర్వీసుంది. కానీ –

ఎవరు వూహించని రీతిలో వల్లభరావును 'వరించిందా' పోస్టు. సత్యమూర్తిగార్ని 'రెచ్చ'గొట్టి మేనేజింగ్ డైరెక్టర్ని కలవండి అంటే –

"... ఆ ... ఎందుకొచ్చిన గొడవలండి ... ఎవరో ఒకరు ... ఎవరు చేసినా ఆఫీసు కోసమే




కదా ..." అన్నారు.

వల్లభరావు రాకముందు ట్రాన్స్‌ఫర్ విషయాలు, ఇతర పనుల్లో 'సీనియర్లు' ఏం 'తంటాలు' పడేవారో తెలీదుకానీ, పెద్దగా 'స్కామ్' జరుగుతున్నట్టు ఎప్పడూ అన్పించలేదు. ఇప్పడు అన్పిస్తున్నా ఎవరూ నోరు విప్పరు. నిజానికి చిన్న అవసరమున్న ఎవరైనా వల్లభరావుని ఆశ్రయిస్తున్నారు. మొదట్లో, పెద్దగా సీటు ప్రభావం, వల్లభరావు 'హస్త మహత్యం' తెలీకపోయినా ఈ మధ్య మరీ ఎక్కువగా, నిశ్శబ్దంగా దుమారంలా చెలరేగుతోంది. ఆ మాటే సత్యమూర్తిగారితో అంటే –

"... అతనూ మనలో ఒకడే ... ఇక సంపాదించుకోవడమంటారా...? ... నిజానికి నాకు వల్లభరావు మీద ఏ రకమైన ద్వేషం లేదు... కానీ ... న్యాయంగా సంపాదించింది సద్వినియోగమవుతుంది... అసలు చర్యకి 'రియాక్షన్' వున్నట్టే అన్యాయానిక్కూడా వుంటుంది... పాపభీతి వున్నవాడెవడూ తప్పు చేయలేడు ..." అన్నారు వేదాంతిలా. ఆయన ఎప్పడూ ఎక్కువగా మాట్లాడరు. హడావిడీ, ఆర్భాటం రాజ్యమేలుతున్న ఈ కాలంలో నిశ్శబ్దంగా తన పనేదో తను చూసుకుని ఏ రకమైన గొడవల్లోనూ తలదూర్చకుండా 'స్థితప్రజ్ఞుడి'లా గడుపుతున్న సత్యమూర్తిగారి మంచితనాన్ని చేతకానితనంగా భావించే వల్లభరావు ఆఫీసర్‌ని 'మఖ్య'పెట్టి ఆ 'సీటు' సంపాదించడన్పించింది.

వల్లభరావుకుమాటల్తో స్టాఫ్‌నే కాదు ఆఫీసర్లని 'బోల్తా' కొట్టించే 'సత్తా' వుంది.

వల్లభరావు సీటుమీద నా 'దృష్టే' కాదు మా బ్యాచ్‌లో జేరిన చలపతి–సురేష్‌ల 'కళ్ళు' కూడా పడ్డాయన్న విషయం నాకు తెలుసు!!!

** ** **

వార్త తెలిసిన వెంటనే చేస్తున్న పని ఆపుచేసి తిన్నగా హాస్పటల్‌కి కదిలాం –

"పెద్ద ఏక్సిడెంటే నంటావా?..." ఆటో ఎక్కుతూ సురేష్ అడిగాడు.

"... ఏమో ... చలపతి ఆఫీసర్‌గారికి ఫోన్ చేస్తే ... అక్కడే వున్న నాకు చెప్పారు ..." అన్నాన్నేను.

నిన్నరాత్రి వల్లభరావుకి ఏక్సిడెంట్ అయిందిట. వాళ్ళింటికి దగ్గర్లో వున్న హాస్పటల్లో జాయిన్ చేశారుట.

"... ఎలా జరిగిందో చెప్పేరా?... " సురేష్ అడిగాడు.

"చెప్పలేదు..." నిరాసక్తిగా చెప్పాను. ఆటో సాగిపోతోంది. నా వూహలు వల్లభరావు 'మించి' ఎప్పడో అతని 'సీటు' వైపు వెళ్ళిపోయాయి.

ఆ సీటు పవర్ కళ్ళముందు కదుల్తోంది...

అన్నిరకాల శక్తులు వున్నా 'విక్రమార్క సింహాసనం' లాంటి ఆ సీటు...

రోజూ వస్తూనే ఫ్యూనుల 'సలాములు...'

టి.ఏ. బిల్లు కోసం 'అతి గౌరవం' యిచ్చే వాళ్ళు ...

ట్రాన్స్‌ఫర్ కోసం 'బతిమాలే' వాళ్ళు...

అవసరమున్నా లేకపోయినా అస్తమానూ 'సంతరించే' వనజాక్షి లాంటి స్టెనోలు ...

క్షణానికోసారి పిలిచే ఆఫీసర్లు...


దాసాను దాసుల్లా నిలబడే క్యాంటీన్ కాంట్రాక్టర్లు...

వీళ్ళందరి 'సేవ'లతో మహరాజులా 'వెలిగి'పోయే అవకాశం ...

కనీసం 'నెల' రోజులు 'లీవ్' పెడితేకానీ ... 'లీవ్ వేకెన్సీ' మరొకరికివ్వరు...

ఎందుకో తెలీదు...

వల్లభరావు కోలుకోవడానికి కనీసం నెలరోజులైనా పడ్తే బాగుండుననిపించిందా క్షణం...




ఆటో సడన్ బ్రేక్‌తో ఆలోచనలకి బ్రేక్ పడింది.

మేము వెళ్ళేసరికి చలపతి అక్కడే వున్నాడు. వల్లభరావు ఇంటిదగ్గరలోనే చలపతి యిల్లు వుండడం వల్ల, ప్రొద్దున్నే వల్లభరావు భార్య కబురుపెట్టిందిట. ప్రాణ ప్రమాదం నుంచి చివరి నిముషంలో తప్పించుకున్నా ... పెద్ద ఏక్సిడెంటే అయిందిట. ప్రస్తుతం స్పెషల్ వార్డులో 'ట్రీట్' చేస్తున్నారట. పగలు పన్నెండు గంటలకి ఒకే ఒక గంట స్పెషల్ వార్డులోకి 'చూడడానికి' వదుల్తారుట.

టైమ్ చూశాడు.

పదకొండున్నర.

"... అసలు ఎలా అయిందిరా?..."

"... నాకు కరెక్టుగా తెలీదురా ... కానీ ... బాగా తాగిన మైకంలో నడుపుతున్న స్కూటర్ కంట్రోల్ తప్పి ... ఎదురుగా వస్తున్న కారుని గుద్దేశారుట... పాపం ... కారువాళ్ళు యింకా మంచి వాళ్ళు కనుక ... హాస్పటల్లో జాయిన్ చేసి ... జేబులో వున్న 'ఐడెంటిటి కార్డు' చూసి యింటికి కబురుచేశారుట.." అన్నాడు చలపతి.

ఒకవైపు జననాల్నీ మరోవైపు మరణాల్నీ చూస్తున్నా ఏ మాత్రం చలించకుండా వున్న 'సర్వసంగ పరిత్యాగి'లా వుంది హాస్పటల్ ...

వచ్చే పేషంట్లతో...

వెళ్ళే వాళ్ళతో ...

హడావిడితో కదిలే నర్సులతో ...

ప్రాణాలు రక్షించడం కోసం శ్రమించే డాక్టర్లతో ...

చూస్తుండగానే అరగంట గడిచిపోయింది.

ఒక్కొక్కరినే పంపిస్తున్నారు...

మొదట చలపతి వెళ్ళాడు ... ఐదు నిముషాల తరువాత వచ్చినతని మొహమెందుకో వివర్ణమైంది!

నేను కదిలాను...

గాఢమైన నిశ్శబ్దం...

వల్లభరావు అప్పుడే నిద్రబోయాట్ట ... అతని భార్య చెప్పింది... ఏ మాత్రం గుర్తుపట్టలేనంతగా అయిపోయాడు... మొహమ్మీద రక్తపు మరకలు స్పష్టాస్పష్టంగా వున్నాయి. మోచేయి దగ్గర అయిన గాయంలో యింకా రక్తం స్రవిస్తూనే వుంది... వళ్ళంతా బ్యాండేజీలతో ... మృత్యువుకి అతి దగ్గరగా వెళ్ళి అదృష్టవశాత్తు బైటపడ్డ వాడిలా వున్నాడు.

రూపురేఖలు మారిన శరీరాన్ని చూసేసరికి ఎందుకో గగుర్పాటు కలిగింది...

మనసులో ఏదో భయం అలుముకుంది...

నుదుటన చెమటలు ... గుండెల్లో సన్నటి వణుకు ... గొంతులోంచి మాట బైటపడక, శోక మూర్తిలా వున్న వల్లభరావు భార్యకి నమస్కరించి బైట కడుగువేశాను.

బుర్రలో ఆలోచన సుళ్ళు...

ఇదివరకు ఓసారి సత్యమూర్తిగారన్న మాటలు గుర్తొచ్చాయి.

ప్రతి ఏక్షన్‌కీ రియాక్షన్ వుంటుంది ...

అన్యాయానికి రియాక్షన్ అన్యాయమేనేమో?

మరీ సెంటిమెంటల్‌గా ఆలోచిస్తున్నాననిపించిదో క్షణం... దెయ్యంలా ఆవహించిన భయం పిరికివాడ్ని చేస్తోంది... సర్వశక్తులు వున్నాయనుకుని, విక్రమార్క సింహాసనమనుకుని 'భ్రమ'పడ్డ ఆ సీటు 'పాముల పుట్టలా' అనిపించింది. చూస్తూ చూస్తూ విషసర్పాన్ని మెడలో వేసుకోగలమా? వల్లభరావుకి 'తాగే' అలవాటువున్నా ఎక్కువగా తాగడానికి కారణం ఆ 'సీటే' అనిపించింది... పై రాబడి మనిషి రూపురేఖల్నే కాదు అలవాట్లుకూడా మార్చేస్తుంది!

నిజం ...

నూటికి తొంభైమంది 'అవకాశం' కోసం చూస్తారు... 'లక్ష్మీ'ని కోసం అర్రులు చాస్తారు ... 'అవకాశం అందమైన అప్సరస' లాంటింది ... ఎంత 'నిగ్రహం' వున్న మనిషైనా ఓ బలహీన క్షణంలో ఆ అప్సరస అందచందాలకి దాసోహమనక తప్పదేమో?

'ఇలా గడిచిపోతే' చాలు –

అప్పటిదాకా సొగసులు ఒలకబోసిన 'అప్సరస' లాంటి ఆ 'సీటు' వికృతమైన 'అనాకారి'లా అనిపించింది!!!

** ** **

"... వల్లభరావుగారు కోలుకోవడానికి కనీసం రెండు నెలలు పడ్తుంది... మీరు ముగ్గురే ప్రస్తుతమున్న సీనియర్లు ... ఒకేసారి సర్వీసులో జాయినయ్యారు... మీ యిష్టం... మీలో ఎవరో ఒకరు ఆ సీటు 'సెలక్ట్' చేసుకోండి..." అన్నాడాఫీసర్ మాకే 'ఛాయిస్' యిస్తున్నట్టు.

"... నాకే మాత్రం ఆసక్తి లేదు సార్... చలపతి, సురేష్‌ల్లో ఎవరో ఒకర్ని సెలక్ట్ చేయండి..." అన్నాన్నేనాయన మాటలు పూర్తికాకముందే.

వాళ్ళిద్దరి వైపు చూశాడు ఆఫీసర్. రెండు నిముషాల తర్వాత చలపతి అన్నాడు –

"... నాకు ప్రస్తుతమున్న వర్కే ఇంట్రస్టింగ్‌గా వుంది సార్. నాకూ వద్దు ..." అన్నాడు.

"... క్యాంపుల వుద్యోగానికి అలవాటు పడ్డాను సార్ నేను ... ఒకచోట కూమని చేసే ఓపికలేదు సార్ నాకు ..." అన్నాడు చిత్రంగా నవ్వుతూ సురేష్.

ఆఫీసర్ ఆలోచనలో పడ్డట్టుగా వుండి –

"... అలా ముగ్గురూ కాదంటే ఎలాగండీ...? ... చాలా ముఖ్యమైన సీటది ... ఎవరో ఒకరు చేయాలి ... నిజానికి మీలో ఎవరో ఒకరిని పోస్ట్ చేసే అధికారంనాకుంది... కానీ ... ముగ్గురూ ఒకేసారి సర్వీసులోకి వచ్చారని ... మళ్ళీ మీలో భేదాలు రాకూడదని మిమ్మల్ని పిలిచాను..." అని –

".. మీకోరోజు టైమ్ యిస్తున్నాను ... ఆలోచించుకుని చెప్పండి..." అన్నాడు.

ముగ్గురం బైటకొచ్చి, ఆలోచనల్లో పడ్డాము.

గంటకుపైగా చర్చించి, ఓ నిర్ణయానికొచ్చాము.

పైకి చెప్పిన కారణాలేమైనా మా ముగ్గురికీ ఆ సీటు అంటే యిష్టం లేదు.

అతి కష్టమ్మీద 'సత్యమూర్తి'గారిని ఒప్పించి, సత్యమూర్తిగారి పేరుని ఏ మాత్రం వూహించని ఆఫీసర్‌కి నచ్చజెప్పి 'భారం' దించుకున్నట్టు భావించాము.

'పాపం చేసే' మనిషి భయపడ్తాడో లేదో తెలీదుకానీ 'పాప ఫలితాన్ని' కళ్ళారా చూసిన మనిషి మాత్రం భయపడ్తూనే వుంటాడు!!!